క్లుప్తంగా

రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

బేతంచెర్ల: మండల కేంద్రం నుంచి వెల్దుర్తి మండలానికి వెళ్లే రహదారిలో కంపచెట్లు పెరిగి ప్రమాదకరంగా మారాయి. దీనిపై ఈనెల 6వ తేదీన ప్రమాదకరంగా పిచ్చి మొక్కలు అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్అండ్బీ అధికారులు స్పందించి బేతంచెర్ల నుంచి వెల్దుర్తికి వెళ్లే రహదారిలో కొలుములపల్లె, ముద్దవరం, ఎం.పెండేకల్లు గ్రామాల్లో రహదారి పక్కన్న ప్రమాదకరంగా ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు.

ప్రత్యేక ఆహ్వాన సభ్యుడిగా చంద్రమౌళీశ్వర్ రెడ్డి



బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డికి స్వామి వారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

బేతంచెర్ల: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల పుణ్యక్షేత్రంలో కొత్తగా ఏర్పడిన ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానిత సభ్యుడి హోదాలో బేతంచెర్ల పట్టణానికి చెందిన బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ, సిబ్బంది వారికి ఆయనకు స్వామివారి చిత్ర పటం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, హిందూ సోదరులు, పారిశ్రామిక వేత్తలు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డిని అభినందించారు.


సామాజిక సేవలు అభినందనీయం



మహమ్మద్ రఫీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బేతంచెర్ల: దేశ నాయకుల సేవలను గుర్తు చేస్తూ తన వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ సేవలు అభినందనీయం అని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ అన్నారు. ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా స్వచ్ఛ ఆంధ్ర ఆవార్డు అందుకున్న సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీని బుధవారం పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, స్వాతంత్ర్య సమరయోధుడు దండు నారాయణ రాజు జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాళలు వేసి నివాళులర్పించారు.


శుభకార్యం



వధువరులతో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

డోన్: రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, చంద్రలక్ష్మి దంపతుల కుమారుడు రాజ్కుమార్, ప్రియాంక భార్గవి వివాహ కార్యక్రమానికి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని వారి స్వగృహంలో బుధవారం జరిగిన శుభకార్యానికి శిల్పా హాజరై వధువరులను ఆశీర్వదించారు. అలాగే ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్కుమార్, క్లస్టర్ యూనివర్సిటీ సభ్యులు ముడియాల నాగభూషణంరెడ్డి, పార్టీ వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి జాకీర్ హుసేన్, మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ మండలాధ్యక్షులు సోమేష్ యాదవ్, నాయకులు బొబ్బల శివరామిరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, శేఖర్ యాదవ్, రఫీ, పార్టీ కార్యనిర్వాహకులు మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



ముక్కమల్ల గ్రామంలో మలుపు వద్ద రోడ్డుపైకి వచ్చిన కంపచెట్లు

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో బస్టాండ్ సమీపంలో వద్ద ఉన్న మలుపు వద్ద ఇరువైపులా కంపచెట్లు రోడ్డుపైకి రావడంతో ప్రమాదం పొంచి ఉంది. ఎల్ ఆకారంలో మలుపు ఉండటం, మలుపు వద్ద కంపచెట్లు ఏపుగా పెరగడం, రోడ్డు పైకి రావడంతో వాహనాదారులకు ఇబ్బందిగా మారింది. ఏదైన ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ఇరువైపులా కంప చెట్లను తొలగించాలని వాహనాదారులు కోరుతున్నారు.

గ్యాస్ సిలిండర్పై డెలివరీ దోపిడీ

- రూ.50–60 అదనంగా వసూలు
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు



వాహనం ద్వారా గ్యాస్ సిలిండర్ల సరఫరా

బనగానపల్లె: పట్టణంలోని బాలాజీ గ్యాస్ ఎంటర్ప్రైజస్ (భారత్ గ్యాస్) ద్వారా నిబంధనల ప్రకారం వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగకపోవడంతో పాటు అదనపు చార్జీ వసూలు చేస్తుండటంతో వినియోగదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా గ్యాస్ ఏజెన్సీ డీలర్పై చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. బనగానపల్లె భారత్ గ్యాస్ డీలర్ పరిధిలో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కలిపి సుమారు 12 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం గ్యాస్ సిలిండర్ కోసం బుకింగ్ చేసిన 24 గంటల్లోపు వినియోగదారుడి ఇంటికి డెలివరీ చేయాలి.

ఐదు కి.మీలోపు డెలివరీ ఉచితం

నిబంధనల ప్రకారం గ్యాస్ సిలిండర్ 5–15 కిలోమీటర్ల దూరంలో డెలివరీ చేయాలంటే రూ.20 మాత్రమే వసులు చేయాలి. 15 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం డెలివరీకి రూ.30 వసూలు చేయవచ్చు. ఈ నిబంధనలు అతిక్రమించి డెలివరీ చేసే వారు ఎక్కువ రుసుం వసూలు చేస్తే ఆయిల్ మార్కెట్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు లేదా జిల్లా పౌరసరఫరా అధికారి లేదా సేల్స్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. కానీ ఇక్కడి గ్యాస్ ఏజెన్సీ వారు సిలిండర్ డెలివరీ చేసే సమయంలో ఐదు కిలోమీటర్ల దూరంలోపు ఉన్నా వినియోగదారుడి నుంచి రూ.40–50 వసూలు చేస్తున్నారు. అపార్ట్మెంట్ పై అంతస్తుల్లో ఉన్న గృహాలకు అదనంగా మరో రూ.10 వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. అదనపు చార్జీ ఇవ్వకపోతే గ్యాస్ సిలిండర్ ఇవ్వమని డెలివరీ బాయ్లు బెదిరిస్తున్నారని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం బుకింగ్ చేసిన 24 గంటల్లోపు సిలిండర్ వినియోగదారుడికి ఇవ్వాల్సి ఉండగా 8–10 రోజుల వరకు కూడా ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. దీనిపై గ్యాస్ ఏజెన్సీ వారిని ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వడం లేదని దీంతో వారు ఇచ్చినప్పుడే సిలిండర్ తీసుకోవాల్సి వస్తోందన్నారు. గ్యాస్ డీలర్ పరిధిలో సుమారు 8 మంది డెలివరీ బాయ్లు పనిచేస్తుండగా తనిఖీ అధికారులు వచ్చిన సమయంలో వారు అందుబాటులో ఉండరు. ఆ సమయంలో తనిఖీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు జరిపి వెళుతున్నట్లు సమాచారం.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో కొన్ని వందల గ్యాస్ కనెక్షన్లను ఇక్కడి నుంచి బేతంచర్ల భారత్ గ్యాస్ ఏజెన్సీకి బదిలీ చేసిన విషయం తెలిసిందే.

నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ గోడౌన్ ఏర్పాటు

నిబంధనల ప్రకారం జనావాసాలు, పరిశ్రమలు లేని ప్రాంతంలో గ్యాస్ గోడౌన్ ఉండాలి. కానీ ఇక్కడి గ్యాస్ గోడౌన్ చుట్టూ పాలీషింగ్ ఫ్యాక్టరీలు, నివాస గృహాలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో గ్యాస్ గోడౌన్ ఏర్పాటుకు సంబంధిత అధికారులు అనుమతి ఎలా ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుకోని విధంగా ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని నిబంధనల ప్రకారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయాలని, ప్రమాదం జరగక ముందే ముందస్తు చర్యగా గ్యాస్ గోడౌన్పై తగిన చర్యలు తీసుకొని మరో ప్రాంతానికి తరలించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు



స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీ వారు సిలిండర్ల డెలివరీలో నిబంధనలు పాటించడం లేదు. ఒక్కో సిలిండర్ డెలివరీకి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దీనిపై వినియోగదారులు ఫిర్యాదులు చేసినా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడంలేదు. నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం ఎమ్మార్వో ఆధ్వర్యంలో వినియోగదారుల సమావేశం ఏర్పాటు చేయాలి. ఇక్కడ గ్యాస్ సిలిండర్ల పంపిణీ సక్రమంగా లేనందునే బేతంచర్ల, కొలిమిగుండ్ల అవుకు ప్రాంతాల ఏజెన్సీల ద్వారా బనగానపల్లె ప్రాంతంలో గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు.

– రఘురామిరెడ్డి, న్యాయవాది, బనగానపల్లె

పది రోజుల వరకు సిలిండర్ ఇవ్వరు



గ్యాస్ సిలిండర్ కోసం బుకింగ్ చేసిన తరువాత పది రోజుల వరకు డెలివరీ ఇవ్వరు. కొన్ని సమయాల్లో మరిన్ని రోజులు సమయం పడుతుంది. గ్యాస్ సిలిండర్ కోసం ఫోన్ చేస్తే సరైన సమాధానం ఉండదు. నిబంధనల ప్రకారం 24 గంటల్లోపు వంటగ్యాస్ సిలిండర్ డెలివరీ ఇవ్వాలి. సిలిండర్లను సక్రమంగా డెలివరీ చేయని ఏజన్సీ డీలర్పై అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ఎస్.హుస్సేని, ఖాజీవాడ, బనగానపల్లె

పేరుకే సబ్సిడీ!



కొలిమిగుండ్ల ఆర్ఎస్కేలోకి విత్తన ప్యాకెట్లను చేర్చుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: రబీ సీజన్లో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ శనగ విత్తనాల ధర బహిరంగ మార్కెట్ ధరకు సమానంగా ఉంది. దీంతో ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు చెప్పుకోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదికూడా కేవలం 25 శాతం సబ్సిడీ మాత్రమే ఇస్తున్నారని, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 40 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేశారని రైతులు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటా శనగ విత్తనాల ధర రూ.7800గా నిర్ణయించి 25 శాతం రాయితీపై రైతులకు రూ.5850 అందిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం క్వింటా నాణ్యమైన శనగ విత్తనాల ధర రూ.5800 నడుస్తుందని రైతులు పేర్కొన్నారు. ఈ లెక్కన సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పుకోవడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. మార్కెట్లో మంచి విత్తనాలు పుష్కలంగా లభిస్తుండటంతో చాలా మంది రైతులు బయటనే కొనుగోలు చేశారు. కొలిమిగుండ్ల మండలంలో రబీలో 10 వేల ఎకరాల్లో శనగ సాగవుతుంది. సీజన్ ప్రారంభమైనా సకాలంలో విత్తనాలు పంపిణీ చేయడం లేదని రైతుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

కొనసాగుతున్న ఆభరణాల లెక్కింపు



వెండి ఆభరణాల లెక్కింపును పరిశీలిస్తున్న పాండురంగారెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయానికి భక్తులు విరాళంగా అందజేసిన ఆభరణాల లెక్కింపు కార్యక్రమం రెండవ రోజు బుధవారం కొనసాగింది. మొదటి రోజు మంగళవారం రాయలసీమ జోన్ జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో బంగారు అభరణాల లెక్కింపు పూర్తి చేశారు. రెండువ రోజు భక్తులు అమ్మవారికి విరాళంగా అందజేసిన వెండి ఆభరణాల లెక్కింపు కార్యక్రమం కొనసాగింది. 2007–2019 వరకు భక్తులు విరాళంగా అందజేసిన వెండి అభరణాల లెక్కింపు పూర్తయ్యిందని, ఇంకా 2019 నుంచి ఇప్పటివరకు భక్తులు వచ్చిన వెండి అభరణాల లెక్కింపు గురువారం చేపట్టనున్నట్లు జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మహానంది ఆలయ ఏఈఓ మధు, సూపరింటెండెంట్ నీలకంఠ, ఈఓ రామానుజన్, ఆలయ అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

17న టెంకాయల వేలం పాట

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని పురాతన నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని టెంకాయల విక్రయ హక్కులకు ఈ నెల 17న వేలం పాట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. వేలం దక్కించుకున్న వారు కార్తీక మాసం పూర్తయ్యే వరకు ఆలయం వద్ద టెంకాయలు విక్రయించవచ్చని చెప్పారు. నవంబర్ 17న తిరునాల మహోత్సవం పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. ఆసక్తి గల వ్యక్తులు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

దొంగ పోలీసు!

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరామనగర్లో మంగళవారం రాత్రి చైన్ స్నాచింగ్కు పాల్పడింది పోలీసే అని తెలిసి అందరూ అవాక్కయ్యారు. పట్టణ పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస ఆచారి గత కొద్ది నెలలుగా విధులకు సరిగా హాజరుకాక సిక్ లీవ్లో ఉంటూ మద్యానికి బానిసైనట్లు తెలిసింది. మద్యం మత్తులో ఈ నెల 14వ తేదీ రాత్రి మహిళ మెడలోని బంగారు గొలుసును లాగేస్తూ ప్రజలకు దొరికిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు పోలీసుపై పట్టణ పోలీసు స్టేషన్లో బుధవారం కేసు నమోదు చేశారు.

రైతుల సమక్షంలో సర్వే చేయాలి



బొందలదిన్నెలో రీసర్వేను పరిశీలిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

సంజామల: రైతుల సమక్షంలో రీసర్వే నిర్వహించాలని విజయవాడ కమిషనర్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామంలో రీసర్వే పనులను డీఐ నీలకంఠప్పతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే పనులకు రైతులు సహకరించాలని సూచించారు. రీసర్వే పనులు ప్రారంభం అయ్యే సమయానికి రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలోనే పనులు ప్రారంభించాలన్నారు. రీసర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సంజామల రీసర్వే డీటీ తులసికృష్ణ, మండల సర్వేయర్ మల్లేశ్వరి, వీఆర్ఓ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా ఆలయ కమిటీ ఎన్నిక



సమావేశమైన కమిటీ సభ్యులు

ప్యాపిలి: స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక వ్యవహారం వివాదాస్పదంగా మారింది. పాత కమిటీ ఏర్పడి పదేళ్ల పూర్తయినందున రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా మాసాని కుమార్, ఉపాధ్యక్షుడిగా కునిగిరి శివశంకర్తో పాటు మరి కొందరితో నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ ఏర్పాటును పాత కమిటీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు బుధవారం వారు ఆలయంలో సమావేశమయ్యారు. తమకు సరైన సమాచారం ఇవ్వకుండా కొందరితో సమావేశం నిర్వహించి ఎన్నుకున్న కమిటీని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర నాయకులు వచ్చి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీకి ఫిర్యాదు చేశారు. అప్పటివరకు తాత్కాలికంగా అధ్యక్షుడిగా బండా రమణ, ఉపాధ్యక్షుడిగా రొడ్డా సోమశేఖర్, కార్యదర్శులుగా రొడ్డా వరలక్ష్మి, కోశాధికారిగా తట్టి లక్ష్మీప్రసాద్, సహాయ కోశాధికారిగా మాసాని గంగాధర్తో పాటు మరి కొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బస్సు ఢీకొని 12 మేకలు మృతి

పెద్దకడబూరు: మేకల మందపై బస్సు దూసుకెళ్లిన సంఘటనలో 12 మేకలు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎమ్మిగనూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బాధితుడు గొల్ల తిమ్మప్ప పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామ సమీపంలోని నలంద కాలేజ్ వద్ద మంగళవారం రాత్రి గొర్రెలతో పాటు మేకలను ఆపుకున్నాడు. వర్షం రావడంతో ఒక్కసారిగా మేకలు పక్కనే ఉన్న ఆదోని ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపైకి వచ్చాయి. ఆ సమయంలో రోడ్డుపై ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని బస్సు మేకల మందపై దూసుకెళ్లి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో 12 మేకలు అక్కడికక్కడే చనిపోగా.. మరికొన్ని మేకలు గాయపడ్డాయి. అప్రమత్తమైన గొర్రెల కాపరులు ద్విచక్ర వాహనంపై వెళ్లి ఎమ్మిగనూరు బస్టాండ్లో బస్సుకోసం ఆరా తీశారు. బస్సు అక్కడ లేదు. బస్సు బస్టాండ్లోకి వెళ్లకుండా నేరుగా బైపాస్లో వెళ్లి ఉంటుందని స్థానిక పోలీస్స్టేషన్తో పాటు పెద్దకడబూరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో దాదాపు రూ. 2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తిమ్మప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. మేకలే జీవనాధారం అయిన తనకు అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

గుమ్మకొండ పరిసరాల్లో చిరుత సంచారం?



గ్రామస్తులు గుర్తించిన చిరుత పాద ముద్రలు

డోన్ టౌన్: మండలంలోని గుమ్మకొండ గ్రామ సమీప కొండల్లో చిరుత సంచరించినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గ్రామ సమీపంలోని కొండల్లో బంగారుపాలెం పాతమల్ల అభయాంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం వద్ద ఉన్న ఐదు కుక్కలు గత కొద్ది రోజులుగా ఒక్కొక్కటిగా కన్పించకపోవడంతో అనుమానం కలిగిన ఆలయ పూజారి గ్రామ ప్రజలకు విషయం తెలిపారు. ఈ కుక్కలను చిరుత ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు నిర్ధారించుకొని ఆ ప్రాంతంలో పరిశీలించగా చిరుత అడుగు జాడలు కనిపించాయి. దీంతో గ్రామస్తులు పంట పొలాలకు వెళ్లాలన్నా, దేవుడి దర్శనం కోసం ఒంటరిగా వెళ్లాలన్నా భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు చిరుతను బంధించి ఇతర ప్రాంతంలోని అభయారణ్యంలోకి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై డోన్ ఫారెస్టు అధికారులను వివరణ కోరగా.. చిరుత సంచారం విషయం తమ దృష్టికి రాలేదని, అయితే గత కొద్ది నెలలుగా సమీప కొండల్లో చిరుతలు సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయని, అక్కడినుంచి చిరుత వచ్చి ఉండే అవకాశం లేకపోలేదని చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలోని కొత్తకొట్టాల ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం ఎదుట ప్రజలు బుధవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎస్ఏ రహిమాన్, నక్కి శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు. కొత్తకొట్టాల ప్రాంతంలో దాదాపు 200 కుటుంబాలు నివసిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో గత మూడు నెలలుగా నీటి ఎద్దడి నెలకొందన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులను అడిగినా స్పందించడం లేదన్నారు. నీటి సమస్యను పరిష్కరించే వరకు సచివాలయం నుంచి అధికారులను బయటకు వెళ్లనిచ్చేది లేదని భీష్మించి కూర్చున్నారు. దీంతో అక్కడకు చేరుకున్న ఆర్డబ్ల్యూఎస్ అధికారులు వారం రోజుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నిరసనలో వడ్డె శ్రీను, కృష్ణ, సెంట్రింగ్ మధు, లక్ష్మన్న, మద్దిలేటి, ఆనంద్, వీరభద్రుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఏకాగ్రత



యోగా గురువు సుధాకర్ను సత్కరించిన విద్యార్థులు

డోన్: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు, అనుకున్న లక్ష్యాల సాధన కోసం ప్రతిరోజూ గంట పాటు యోగా సాధన, ధ్యానం చేయాలని ప్రముఖ గురూజీ సుధాకర్ సూచించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, హాస్టల్ మ్యాటిన్ సునీత అధ్యక్షతన బుధవారం జరిగిన యోగాసనాల సాధన కార్యక్రమంలో యోగా గురువు సుధాకర్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ భవిష్యత్తు, గతంలోకి వెళ్లకుండా వర్తమానంలో జీవించేందుకు ప్రయత్నించినప్పుడే ఏకాగ్రత సాధ్యమవుతుందన్నారు. చదువులతో అత్యున్నత స్థానాలు పొందాలంటే ఏకాగ్రత అవసరమని, అది ధ్యానం, యోగా ద్వారానే సాధ్యమవుతుందన్నారు. గీతా యోగాసన సంఘం అధ్యక్షుడు రాంపుల్లయ్య, సభ్యులు మాకం బాలు, సముద్రాల బాబు, ముడియాల శైలజ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యోగా గురువు సుధాకర్ను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

పత్తికొండ: కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ధర్నా చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు, మాజీ ఏజీపీ నరసింహ ఆచారి, కారం నాగరాజు మాట్లాడుతూ..కర్నూల్లో హైకోర్టు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విభజన అనంతరం అప్పటి బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదులు నాగేష్, దామోదర్ ఆచారి, మునెయ్య, మధు, అరుణ్, హరికృష్ణ పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించాలి

కోవెలకుంట్ల: డీఎస్సీ తర్వాత మిగిలిన ఖాళీ పోస్టుల్లో అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్లో బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో చాలా మంది రిలీవర్ వచ్చే వరకు పాత పాఠశాలల్లోనే కొనసాగాలని, వేతనం మాత్రం బదిలీ పొందిన పాఠశాలల్లో తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారిని నియమించి రిలీవ్ చేస్తారని ఆశపడ్డారన్నారు. డీఎస్సీ ప్రక్రియ ద్వారా కొన్నిచోట్ల ఖాళీలు భర్తీ కాక బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఖాళీ పోస్టుల్లో అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించి బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.

కూలేందుకు సిద్ధం!



శిథిలావస్థలో సబ్ ట్రెజరీ కార్యాలయం

బనగానపల్లె: బనగానపల్లె సంస్థానాన్ని నవాబులు పరిపాలించే కాలంలో 1913లో సబ్ ట్రెజరీ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ కార్యాలయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరింది. దీంతో కార్యాలయంలో పని చేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం పరిధిలో బనగానపల్లె, బేతంచర్ల, కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో 160 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా ఇందులో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 700 మంది పింఛన్దారులు ఉన్నారు. వీరందరికీ అనుసంధానంగా సబ్ట్రెజరీ కార్యాలయం పని చేస్తోంది. వర్షం వచ్చిన సమయంలో కార్యాలయం లోపలి భాగానికి నీరు చేరుతుందని, ఆ తరువాత రెండు మూడు రోజుల పాటు పైభాగం నుంచి నీటి చుక్కలు పడుతూనే ఉంటాయని ఇక్కడ పని చేసే సిబ్బంది చెబుతున్నారు. నూతన కార్యాలయం ఏర్పాటుకు గతంలో రూ.1.08 కోట్లు మంజూరుకాగా స్థల సమస్య వల్ల నిధులు రద్దయ్యాయి. కార్యాలయం పక్కభాగంలో సబ్ ట్రెజరీ కార్యాలయం నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలం ఉన్నా అనుమతుల మంజూరులో జాప్యం జరుగుతున్నట్లు కార్యాలయ ట్రెజరీ అధికారి పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన కార్యాలయంలో విధులు నిర్వర్తించడం ఇబ్బందిగా ఉన్నట్లు వాపోయారు. ఆరు సంవత్సరాల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇక్కడ కొన్ని ఫైల్స్ దహనమైనట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించాలని కోరుతున్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు



బనగానపల్లె ఆర్టీసీ బస్టాండ్లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

బనగానపల్లె రూరల్: ప్రధాని నరేంద్రమోదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన సందర్భంగా గురువారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు జనాన్ని తరలించేందుకు కూటమి ప్రభుత్వం ప్రైవేట్ బస్సులతో పాటు ఆర్టీసీ బస్సులను వినియోగిస్తోంది. ఆరీస్టీ బస్సు సరీస్లను చాలావరకు బుధవారం నుంచే అధికారులు డిపోలకు పరిమితం చేయడంతో వివిధ గ్రామాలకు వెళ్లేందుకు బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రయాణికులు, అత్యవసర పనుల నిమిత్తం వెళ్లే వారు బస్సు సర్వీసులు తగినంతగా లేని కారణంగా గంటల తరబడి బస్టాండ్లోనే పడిగాపులు కాశారు. ఉన్న కొద్దిపాటి బస్సుల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేయాల్సి వచ్చింది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. బనగానపల్లె డిపోలో మొత్తం 62 బస్సులు ఉండగా 42 బస్సులను ప్రధాని పర్యటనకు జనాన్ని తరలించేందుకు కేటాయించారు. దీంతో నేడు కూడా ఇబ్బందులు తప్పవని పలువురు ప్రయాణికులు వాపోయారు.

నిర్లక్ష్యం.. పొంచి ఉన్న అపాయం





ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై వెళ్లకుండా రైలు పట్టాలను దాటుతున్న ప్రయాణికులు

బేతంచెర్ల: పట్టణంలోని రైల్వే స్టేషన్ల్లో ప్రయాణికుల నిర్లక్ష్యం వల్ల అపాయం పొంచి ఉంది. రెండవ ఫ్లాట్ ఫారం మీదకు వెళ్లి రైలు ఎక్కడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉన్నా కొందరు ప్రయాణికులు నిర్లక్ష్యంగా పట్టాలు దాటుకుని వెళ్లి ఎక్కుతున్నారు. ముఖ్యంగా ఆ సమయంలో వేరే రైళ్లు, గూడ్స్ బండ్లు వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. త్వరగా రైలు ఎక్కాలని, త్వరగా ఒకటవ ఫ్లాట్ ఫారం వద్దకు రావాలనే ఆత్రుతతోనే మరే కారణం చేతనో ప్రయాణికులు ప్రతి రోజు పట్టాలపై నడిచివెళ్లి రైలు ఎక్కుతున్నారు. ఒక్క క్షణం ఆలోచించి మీ కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై వెళ్లి ఫ్లాట్పాం పైకి చేరుకోవాలని రైల్వే అధికారులు సూచిస్తున్నారు.